క్లుప్తంగా

కులగణనను త్వరితగతిన పూర్తి చేయండి


సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న కులగణన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి మండలంలోని పోలకల్ గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. వలంటీర్లు పూర్తి చేసిన సర్వేను తనిఖీ చేశారు. ప్రతి క్లస్టర్‌లో కులగణన త్వరగా పూర్తి చేసేలా సచివాలయ ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శుక్రవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.255 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

భోగేశ్వరంలో రథసప్తమి పూజలు


ప్రత్యేక అలంకరణలో భోగేశ్వరుడు

గడివేముల: రథసప్తమి సందర్భంగా భోగేశ్వరాలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకం, కుంకుమార్చన చేశారు. అనంతరం నవగ్రహాల్లో సూర్యదేవుడికి విశేష ద్రవ్యాభిషేకం, అలంకరణ పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి,అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఐసాని సునీల్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


కారును ఢీకొట్టిన బైక్

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంకర ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్‌ఐ ఫజుల్లాఖాన్ వివరాల మేరకు.. గోకులపాడుకు చెందిన యువకులు శివకుమార్, శ్రీధర్‌లు కె.నాగలాపురం నుంచి బుల్లెట్ బైక్‌పై గ్రామానికి బయలుదేరారు. కర్నూలు నుంచి కోడుమూరు వైపు వస్తున్న కారును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శివకుమార్, శ్రీధర్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

హెచ్‌ఐవీపై కళాజాత


పాణ్యంలో అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

పాణ్యం: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో పాణ్యంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఎయిడ్స్‌పై కళాజాత సభ్యులు శుక్రవారం అవగహన కల్పించారు. వ్యాధి సోకిన వారిపై వివక్ష చూపరాదన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల జయంతి


నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నేతలు

పాణ్యం: శ్రీకృష్ణదేవరాయల జయంతిని శుక్రవారం పాణ్యంలో ఘనంగా నిర్వహించారు. బలిజసంఘం నేతలు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆ సంఘం నేత మాదాసు వెంకటస్వామి మాట్లాడుతూ.. బలిజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.రాయల వారి గొప్పతనాన్ని సభ్యులకు వివరించారు. బాలక్రిష్ణ, సూరి ఎల్లసుబ్బయ్య, కమలాకర్, సుధాకర్, బాల పాల్గొన్నారు.

సేల్స్‌మెన్‌పై కేసు నమోదు

కల్లూరు: కల్లూరు మద్యం దుకాణంలో పనిచేస్తున్న సేల్స్‌మెన్‌పై కేసు నమోదైంది. ఈ దుకాణంలో రూ.140 ఉన్న మద్యం సీసాను రూ.180కు అమ్ముతుండగా సెబ్ అధికారులు కేసు నమోదు చేశారు. అలాగే ఉలిందకొండ మద్యం దుకాణంలో కూడా అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రూ.50 వేలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఎక్సైజ్ అధికారులు రికవరీకి చర్యలు తీసుకున్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- అక్కాచెల్లెమ్మలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే జగనన్న ధ్యేయం
- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో కుడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సతీష్



పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్, హాజరైన మహిళలు

కోడుమూరు రూరల్: మహిళా సాధికారతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ అన్నారు. శుక్రవారం కోడుమూరులోని ఎల్‌ఎల్‌సీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైఎస్సార్ ఆసరా 4వ విడత కింద కోడుమూరు మండలంలోని 824 గ్రూపులకు మంజూరైన రూ.4.81కోట్ల మెగా చెక్కును పొదుపు సంఘాల మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న సంకల్పంతో అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి వాటిని మహిళలకే అందజేస్తూ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో ఏ పథకం పొందాలన్నా ఆ పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయాలు, వలంటర్ల ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయని తెలిపారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ అవుతోందని చెప్పారు. 2014 ఎన్నికల సమయంలో బూటకపు హామీలిచ్చి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చారని.. ఆ తర్వాత హామీలను విస్మరించారని అన్నారు. మరోసారి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని.. ప్రజలే ఆయనకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ రూతమ్మ, పొదుపు సంఘాల మహిళలతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏపీఎం పుష్పావతి మాట్లాడుతూ.. కోడుమూరులో పొదుపు మహిళల సహకారంతో ఏర్పాటు చేసిన మహిళా మార్టులో ఇప్పటి వరకు రూ.2 కోట్లకు పైగా టర్నోవర్ జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివ్య, సర్పంచ్‌లు శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

కోడుమూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కోడుమూరులోని గొల్లవీధి, సుందరయ్యనగర్‌లో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఆదిమూలపు సతీష్, ఎంపీపీ రూతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నియోజకవర్గంలో రూ.200 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, చనుగొండ్ల ప్రతాప్‌రెడ్డి, సాజిత్ అలీ, రవికుమార్‌రెడ్డి, లింగన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి శ్రీరామరక్ష

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యానికి భరోసా లభిస్తోందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్ అన్నారు. శుక్రవారం కోడుమూరులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు పరిశీలించారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం రెండో విడతగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజచేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్


మెడికల్ కిట్లు అందిస్తున్న నాయకులు


వైద్యసేవలపై ఆరాతీస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య

హెల్త్ క్యాంపును తనిఖీ చేసిన డీఎంఅండ్‌హెచ్‌ఓ

కోడుమూరులోని కొండపేట పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య తనిఖీ చేశారు. వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ గాడి రూతమ్మ, వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న, వైద్యులు యామిని, నిరంజన్, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప పాల్గొన్నారు.

సీతారామాలయం నూతన కమిటీ ఎన్నిక


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడులోని శ్రీసీతారామాలయం నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ అభ్యృద్ధి కమిటీ చైర్మన్‌గా శివశంకర్‌రెడ్డి (కల్లూరు సింగిల్ విండో చైర్మన్), కార్యదర్శిగా జి. శేఖర్‌తో పాటు కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. నూతన కమిటీకి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు భీమేష్‌రెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలకల్‌లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సి.బెళగల్: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అనుపమ శుక్రవారం పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తితో కలిసి మండలంలోని పోలకల్, కంబదహాల్, సి.బెళగల్, గొల్లలదొడ్డి గ్రామాల్లో పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఓటర్లకు, సిబ్బందికి అవసరమైన వసతులు, సౌకర్యాలు, సమస్యలను నమోదు చేసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని బీఎల్వోలకు సూచించారు. అదేవిధంగా ఆయా పాఠశాలల్లో విద్యా సంక్షేమ పథకాల అమలు, విద్యార్థులకు చేరుతున్న విషయాలను విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాల సమస్యలను హెచ్‌ఎంలు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. వారి వెంట వీఆర్వోలు, బీఎల్వోలు, హెచ్‌ఎంలు ఉన్నారు.

తాగునీటికి ప్రాధాన్యత


మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్: గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్లాక్ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా పల్లెల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. మండల పరిషత్, పంచాయతీ నిధులను అధిక శాతం నీటి వనరుల ఏర్పాటుకు వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ శకుంతల మాట్లాడుతూ.. ప్రజా అవసరాలు, గ్రామ సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో వ్యవహరించి ప్రణాళికల్లో పొందుపరచాలన్నారు. ఈఓఆర్డీ సందీప్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పథకాల అమల్లో వలంటీర్లది కీలక పాత్ర

- 'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఓర్వకల్లు మండలంలో 279 మందికి సేవా పురస్కారాలు అందజేత


వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని.. సంక్షేమ పథకాల అమల్లో వారిది కీలక పాత్ర అని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఓర్వకల్లు పొదుపు భవన్‌లో ఎంపీడీఓ మల్లీశ్వరి అధ్యక్షతన నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో కన్న తల్లిని కూడా చూడడానికి వెనుకాడుతున్న తరుణంలో వలంటీర్లు సేవలందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో వలంటీర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. లబ్ధిదారులు కష్టకాలంలో ఉన్న సమయంలో సొంత ఖర్చులతో సుదూర ప్రాంతాలకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేసిన ఘటనలు అనేకమని కొనియాడారు. వలంటరీ వ్యవస్థ అందుబాటులోకి తీసుకొచ్చి రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు నాంది పలికారని ప్రశంసించారు. పొరపాటున టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ వ్యవస్థను తొలగించే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేసి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వలంటీర్ల సేవలను గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి విశిష్టమైన పురస్కారాలతో ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. మండలంలో మొత్తం 279 మందికి గాను 5 మందికి సేవా రత్న, 272 మందికి సేవా మిత్ర పురస్కారాలు వచ్చాయని పేర్కొన్నారు. పనితీరును మెరుగుపర్చుకుని సేవా వజ్ర పురస్కారం సాధించాలని సూచించారు. అనంతరం పురస్కారాలు సాధించిన వలంటీర్లను శాలువా, మెడల్స్‌తో సత్కరించారు. నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, హుసనాపురం సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, మండల ఉపాధ్యక్షుడు పద్మనాభరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక బడ్జెట్ సమావేశం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం 11 గంటలకు నగరపాలక సర్వసభ్య ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నగరమేయర్ బీవై రామయ్య తెలిపారు. 2024–25 సంవత్సరపు బడ్జెట్ అంచనాలను ఆమోదించేందుకు చర్చించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నగరపాలక సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆప్కాస్ ద్వారా 665 ఔట్‌సోర్సింగ్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు, ఆరుగురు సెక్యూరిటీ గార్డులను తీసుకునే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఘనంగా వెంకటరామిరెడ్డి తాత ఆరాధనోత్సవం



వెంకటరామిరెడ్డి తాత సేవలో హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్, అశ్వ రథంపై ఊరేగింపు

కోడుమూరు రూరల్: పట్టణంలోని శ్రీసద్గురు రాజయోగివర్యులు తుమ్మిళ్ల వెంకటరామిరెడ్డి తాత 37వ ఆరాధనోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం తాతగారికి పంచామృతాభిషేకం, పూజలు, మంగళహారతి, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీలక్ష్మీ నారాయణస్వామి కల్యాణాన్ని కనుల పండువగా చేశారు. సాయంత్రం తాతవారి ఉత్సవ విగ్రహాన్ని అశ్వ రథంపై కొలువుదీర్చి బీసీ కాలనీలోని శ్రీఆంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగించారు. కేంద్ర మాజీ సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు భాగ్యరత్న, శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన


చిన్నటేకూరు జాతీయ రహదారిపై రైతు సంఘాల రాస్తారోకో

పాణ్యం: పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం తీసుకోవాలని కోరుతూ తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా పాణ్యం బస్టాండ్ సమీపంలోని నాలుగురోడ్ల కూడలిలో రైతు సంఘాల నాయకులు నిరసన తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని కోరారు. అలాగే డ్రైవర్లను జైలుపాలు చేసే హిట్‌అండ్ రన్, కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని సీఐటీయూ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. వివిధ కార్మిక సంఘం నేతలు ప్రతాప్, భాస్కర్, వెంకటాద్రి, శివక్రిష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

–గూడూరు: రైతులపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలు మార్చుకోవాలని సీఐటీయూ కోడుమూరు డివిజన్ నాయకుడు మోహన్ అన్నారు. సీపీఎం నాయకులు పాత బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు.

–గడివేముల: సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని నినాదాలు చేశారు. కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని కోరారు.

–కల్లూరు: స్థానిక చిన్నటేకూరు 44వ జాతీయ రహదారిపై ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, మండల కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.

గడియారం మాయం.. ఉపాధి దూరం


వాచ్ రిపేర్ చేస్తున్న మెకానిక్ షేక్ హుస్సేన్


వివిధ రకాల గోడ గడియారాలు

- సెల్‌ఫోన్‌ల రాకతో మారిన పరిస్థితులు
- స్మార్ట్‌వాచ్‌లపై యువత మోజు
- వాచ్ మెకానిక్‌లకు ఉపాధి కరువు

కర్నూలు (న్యూటౌన్): సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కే కొద్దీ మార్కెట్‌లో పాత వాటికి గిరాకీ తగ్గుతోంది. దీంతో వాటిపై ఆధారపడ్డవారు ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. దీనికి ఉదాహరణగా వాచ్‌లు, గడియారాలను చెప్పుకోవచ్చు. గతంలో వాచీల రిపేరు చేసేవారు వీధికి ఒకరు దర్శనమిచ్చేవారు. అప్పట్లో వాచ్‌షాపులు ఎక్కువగా ఉండేవి. వాచ్ రిపేర్ వర్క్ నేర్చుకోవడానికి సైతం యువకులు ఉత్సాహం చూపించేవారు. ఇది 2002కు ముందు వరకు ఉన్న పరిస్థితి. ఆ తర్వాత ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలోకి సెల్‌పోన్లు వచ్చాయి. సెల్‌ఫోన్‌లోనే టైం చూసుకోవడంతో వాచ్‌లపై ఆసక్తి తగ్గిపోయింది.

అప్పట్లో చేతిగడియారాలదే హవా

చేతి గడియారాల వాడకం 17 ఏళ్ల క్రితం ఎక్కువగా ఉండేది. రకరకల వాచ్‌లు మార్కెట్‌లో లభించేవి. సమయం చూసుకోవడానికి ప్రతి ఒక్కరి చేతిపై దర్శనమిచ్చేది. వీటికి ప్రతి 24 గంటలకు ఒకసారి కీ ఇచ్చుకోవాల్సి వచ్చేది. గోడ గడియారానికి సైతం వారానికోసారి కీ ఇస్తే సరిపోయేది. ఇవి దశాబ్దాలు పని చేశాయి. ఇప్పటి ఎలక్ట్రానిక్ గడియారాలు ఐదేళ్లకు మించి పనిచేసే పరిస్థితి లేదు.

జీవనోపాధి దూరం

ప్రస్తుతం వస్తున్న ఎలక్ట్రానిక్ గడియారాలు, స్మార్ట్ వాచ్‌లు ఐదేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేయడం లేదు. ఇవి ఎక్కువ రిపేర్లకు కూడా సహకరించవు. గతంలో రిపేర్లు వస్తే ఓవర్ ఆయిల్ చేస్తే సరిపోయేది. కీ రాడ్‌లు, వాచ్‌పై గ్లాస్, ముల్లులు ఎక్కువగా రిపేర్‌కు వస్తుండేవి. ఇప్పటి ఎలక్ట్రానిక్ వాచ్‌లకు బ్యాటరీలు మార్చుకుంటే సరిపోతోంది. ఇప్పటి వాచ్‌లు యూజ్ అండ్ త్రో లెక్కనే పని చేస్తున్నాయి. దీని వల్ల వాచ్ రిపేర్లు చేసేవారికి చేతినిండా పని లేకుండా పోతోంది. దీంతో వారు జీవనోపాధి కోల్పోతున్నారు. అందుకే ఆ రంగంపై వెళ్లేవారు తక్కువగా ఉన్నారు. అడపాదడపా అన్నట్లుగా ఉన్న వారికి కూడా వాచ్‌ల సర్వీసింగ్ దొరకడం కష్టంగా మారింది. ప్రస్తుతం వాచ్‌లు బాగు చేసేవారు పట్టణాల్లో షాపుల ముందు చిన్న చెక్కబల్ల పెట్టుకుని పని చేస్తున్నారు.

సర్వం స్మార్ట్‌ఫోన్ల మయం

ఒకప్పుడు రైతులు, విద్యార్థులు ఇలా అన్నివర్గాల వారు ఉదయాన్నే లేవడానికి గడియారంలో అలారం పెట్టుకుని నిద్రలేచేవారు. ఇప్పుడు మొత్తం పరిస్థితి మారింది. సెల్‌ఫోన్ సర్వం అన్నట్లుగా ఉంది. సాధారణ ఫోన్లతో పాటు ఆండ్రాయిడ్, యాపిల్ ఫోన్లలో అన్ని రకాల సౌకర్యాలు ఉంటున్నాయి. సెల్‌ఫోన్‌లో తేదీ, సమయంతో పాటు అలారం సౌకర్యం కూడా ఇస్తున్నారు. దీనివల్ల గడియారాల అవసరమే లేకుండాపోయింది.

25 ఏళ్లుగా ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నా

1984 నుంచి వాచ్, గడియారాల రిపేరు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నా. అలవాటైన వృత్తి కాబట్టే వదలలేకపోతున్నా. ప్రస్తుతం మొబైల్‌ఫోన్ యుగం నడుస్తోంది. గడియారాలకు ఆదరణ కరువైంది. మెకానిక్‌లు లేకపోవడంతో కొందరు గూగుల్, జస్ట్ డయల్‌లో అడ్రస్ కనుక్కుని వచ్చి వాచ్‌లు రిపేర్ చేయించుకుంటున్నారు. ఒకప్పుడు వాచ్‌రిపేర్ మెకానిక్‌లను వాచ్‌మాస్టర్ అని ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

–షేక్ హుస్సేన్, గడియారాల మెకానిక్, కర్నూలు